క్లుప్తంగా

హామీలు నెరవేర్చాలి



మాచారెడ్డి: ప్రభుత్వ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఎంసీపీఐ మండల కార్యదర్శి లాలబోయిన శేఖర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో బుధవారం మాట్లాడారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు రెండు హామీలను మాత్రమే అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో పోశవ్వ,రాజయ్య, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి పనులు

రామారెడ్డి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి పనులు జరిగాయని ఎంపీపీ దశరథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ఉప్పల్‌వాయి నుంచి మోషన్‌పూర్ గ్రామల వరకు ఉన్న మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు నాటి ఎమ్మెల్యే సురేందర్ నిధులు మంజూరు చేయించేందుకు ఎంతో కృషి చేశారని అన్నారు. నేడు అవే పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని ఆ పార్టీ నాయకులు ప్రగల్భాలు పలకడం సిగ్గుచేటని విమర్శించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



ఎల్లారెడ్డిరూరల్: పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ మాధవి అన్నారు. మండలంలోని మత్తమాల పీహెచ్‌సీలో సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. రోగులకు మందులను అందించడంతో పాటు వారికి సరైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉషాగౌడ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలు సకాలంలో వేయించాలి



రామారెడ్డి: తల్లితండ్రులు తమ చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని మండల వైద్యాధికారి సురేశ్ అన్నారు. మండలంలోని పోసానిపేటలో బుధవారం వైద్య సిబ్బందితో కలిసి సబ్ సెంటర్‌లో వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రామంలో డ్రగ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ ఇతర పరీక్షలకు సంబంధించి ప్రజలకు సూచనలు చేశారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలోని పలు కాలనీల్లో నీటి ఎద్దడి నెలకొనడంతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బోరు వేయించినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. గ్రామంలోని పలు కాలనీల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. సమస్యను ఎమ్మెల్యేకు విన్నవించడంతో స్పందించిన ఆయన బోరు వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గురుప్రతాప్, కాంగ్రెస్ నాయకులు రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



తాడ్వాయి: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. కొన్నేళ్లుగా గ్రామాల్లోని పలు విద్యుత్ స్తంభాలు ఇలాగే వేలాడుతూ చేతికి అందే ఎత్తులో వైర్లు ఉన్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కిందికి వేలాడుతున్న వైర్లతో తాము పంటలు ఎలా వేసుకోవాలో అర్థం కావడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆఖరి మజిలీకి అవస్థలే..

- ఎండాకాలం చెరువులో అంత్యక్రియలు
- వానాకాలంలో ఆరు గజాల స్థలంలోనే..
- మరో వైకుంఠధామాన్ని నిర్మించాలని రామారెడ్డి గ్రామస్తుల వేడుకోలు



పటేల్ చెరువులో నీరు ఎండిపోవడంతో బయటపడ్డ సమాధి



చెరువు పక్కన ఆరు గజాల స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న బంధువులు (ఫైల్)

రామారెడ్డి: మనిషి మరణించిన తర్వాత అన్నింటిని వదిలి పరలోకానికి వెళ్లే క్రమంలో ఆఖరి మజిలీ ఘట్టం కీలకం. ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగ మింగుకుని అంత్యక్రియలు నిర్వహించేందుకు వైకుంఠధామానికి వెళ్తున్న కుటుంబ సభ్యులకు అక్కడి సౌకర్యాలు వెక్కిరిస్తున్నాయి. ఫలితంగా మృతుల బంధువులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

జనాభా పరంగా రామారెడ్డి పెద్ద గ్రామం. గ్రామంలోని చింతలకుంటలో గత ప్రభుత్వం వైకుంఠధామాన్ని ఏర్పాటు చేసింది. పెద్ద గ్రామం కావడంతో ఎవరైనా చనిపోతే చింతలకుంట వైకుంఠధామం, పటేల్ చెరువు దగ్గర రెండు చోట్ల అంత్యక్రియలు నిర్వహిస్తారు. పటేల్ చెరువు వైపు అంత్యక్రియలకు స్థలం లేదు. దీంతో ఎండాకాలంలో నీరు లేని వేళ పటేల్ చెరువులో, వానకాలం చెరువు చివరి భాగంలోని ఆరు గజాల స్థలంలో అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కోసారి పటేల్ చెరువు వైపు రెండు, మూడు మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాల్సి వస్తే ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

మరో వైకుంఠధామాన్ని ఏర్పాటు చేయాలి

రామారెడ్డి పెద్ద గ్రామాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజాప్రతినిధులు, జిల్లా యంత్రాంగం స్పందించి పటేల్ చెరువు వైపు మరో వైకుంఠధామాన్ని ఏర్పాటు చేసి చివరి మజిలీకి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే ఈ ప్రాంతంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అధికారులు స్పందించి పటేల్ చెరువు ప్రాంతంలో మరో వైకుంఠధామాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చదువుతోపాటు అన్నిరంగాల్లో రాణించాలి

- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్: విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రభుత్వం సరఫరా చేసిన ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని, తల్లితండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించాలని కోరారు. అనంతరం కేజీబీవీలోని సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరోజన, ఎంఈవో దేవీసింగ్, నాయకులు ప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, పండరి, లోక్యానాయక్, లక్ష్మారెడ్డి, బాల్‌సాయిలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే

మాదక ద్రవ్యాల నివారణకు పాటుపడాలి



చిన్నమల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాన్సువాడ: మాదక ద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. బాన్సువాడ మున్సిఫ్ కోర్టులో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. లీగల్ సర్వీసెస్ కమిటీ, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. జడ్జి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, న్యాయవాదులు ఖలీల్, రమాకాంత్, మోహన్‌రెడ్డి, మొగులయ్య, దత్తాత్రేయ, హమీద్, అజీమ్, పట్టణ సీఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఎల్లారెడ్డిరూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో విద్యార్థులు, సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రవీందర్‌నాయక్, ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్, పోలీసు సిబ్బంది, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎస్ఆర్‌డీ ఆధ్వర్యంలో..

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలోని సమావేశంలో ఇన్స్‌పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్ మెంట్ (ఐఎస్ఆర్‌డీ) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం మొయిజ్, స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అమృత రాజేందర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు కె రాధ, కార్యదర్శి జి గోదావరి, సంస్థ ప్రతినిధి విఠల్ రావు, సీసీ రామచంద్ర గౌడ్, గ్రామ సంఘాల అధ్యక్షులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాన్సువాడలో ర్యాలీ..

చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి రూరల్: మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో ఉన్న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ విద్యార్థులు యాంటీ డ్రగ్, డ్రగ్ ట్రాఫికింగ్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయిరెడ్డి, బాలిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నళిని, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం హనుమాన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీబీపేటలో..

బీబీపేట: డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవీంద్రరెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



కామారెడ్డిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పాఠశాలల బంద్ విజయవంతం



మాచారెడ్డిలో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు



బాన్సువాడలో..

సాక్షి, నెట్‌వర్క్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్‌తో పాటు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని, ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులను నియంత్రించాలని నాయకులు డిమాండ్ చేశారు. పలుచోట్ల విద్యాశాఖ కార్యాలయ అధికారులు, సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమాల్లో ఏబీవీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



భిక్కనూర్‌లో నినాదాలు చేస్తున్న నాయకులు



ఎల్లారెడ్డిలో..



సదాశివనగర్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాఠశాల భూవివాదంపై విచారణ

లింగంపేట: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల భూవివాదంపై రెవెన్యూ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. గత 30 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన ఉప్పరి మణెమ్మ, గంగామణి, కళావతి, బర్ల భారతమ్మ, అనూషమ్మ, దుర్గయ్యలకు చెందిన సర్వే నంబర్ 1248లో వ్యవసాయ భూమి ఉంది. సదరు భూమి ప్రభుత్వ పాఠశాల నిమిత్తం గ్రామస్తుల సూచన మేరకు అప్పగించారు. పాఠశాలకు కేటాయించిన భూమికి బదులుగా మరోచోట భూమి ఇస్తామని చెప్పారు. నేటికి బాధితులకు భూమి కేటాయించకపోవడంతో గతంలో రెండు సార్లు భూమి ఇచ్చిన కుటుంబాలు పాఠశాల ఆవరణలో వంటావార్పు ప్రారంభించారు. ఈ విషయమై తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు పాఠశాలకు చేరుకొని గ్రామస్తులు, బాధితులతో విచారణ చేపట్టారు. పాఠశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిని బాధితులకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

చిన్నారులకు ప్రాథమిక విద్యను అందించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డిరూరల్: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను సక్రమంగా అందించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. సీడీపీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందించి మంచి విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట: మండల కేంద్రంలోని కేజీబీవీలో వంట మనుషుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి వాసంతి తెలిపారు. వంటశాలలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఒకరు హెడ్ కుక్, మరొకరు హెల్పర్‌గా అవసరం ఉందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 27లోగా కేజీబీవీలో దరఖాస్తులను సమర్పించాలన్నారు.

దేవాదాయ భూములను ఆక్రమిస్తే చర్యలు



ఎల్లారెడ్డి: దేవాదాయ శాఖ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల అన్నారు. పట్టణంలోని రామాలయానికి సంబంధించిన భూములను బుధవారం పరిశీలించారు. దేవాదాయ భూములను ఎవరైనా కబ్జా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆమె వెంట సిబ్బంది వేణు, కొండంబట్ల రాజేశ్వర శర్మ, ఆలయ ధర్మకర్త శ్రీధర్ తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత

కామారెడ్డి క్రైం/ నిజాంసాగర్: పట్టణంలోని దేవునిపల్లి పీఎస్‌లో స్థానిక ఎస్సై రాజు ఫోన్ పోయిన బాధితుడికి సెల్‌ఫోన్‌ను బుధవారం అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా శ్రీరాంనగర్ కాలనీకి చెందిన బాధితుడు సంజయ్‌ను ఫోన్‌ను కనుగొన్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని పీఎస్‌లో ఎస్సై సుధాకర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొన్న ఫోన్‌లను బాధితులకు అందజేశారు.

పాల దోపిడీని ఆపాలి

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని పాతరాజంపేట విజయ డెయిరీలో ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు ఉచితంగా ప్రతిరోజు పాలను అందించే పాడి రైతుల దోపిడీని ఆపాలని ఓ రైతు కోరారు. బుధవారం నిర్వహించిన కిసాన్‌మేళాలో కాలోజివాడీకి చెందిన రైతు మాట్లాడుతూ.. ప్రతి రోజు 50 లీటర్ల పాల దోపిడీ జరుగుతోందని దీనిని ఆపాలని కోరారు. కిసాన్ మేళాలోని విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ నందకుమారి మాట్లాడుతూ.. ప్రస్తుతం అలాంటిది ఏమీ లేదన్నారు. మరిన్ని వివరాలు కావాలంటే డెయిరీకి వచ్చి అనుమానాలు నివృత్తి చేసుకోవాలన్నారు.

82 శాతం సర్వే పూర్తి

బిచ్కుంద: మండలంలో గత పది రోజులుగా పంచాయతీ అధికారులు ఇంటింటా చేపట్టిన నల్లాల సర్వే 82 శాతం పూర్తయిందని ఎంపీవో మహబూబ్ బుధవారం తెలిపారు. తాగునీటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జీపీ కార్యదర్శులను ఆదేశించారు.

వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి సింగిల్ విండో ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 300 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. అవసరమైన వారికి ఈసీజీ, 2డీ ఏకో, పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి భాగ్యలక్ష్మి, రామారెడ్డి మండల వైద్యాధికారి సురేశ్, విండో సీఈవో భైరయ్య, డైరెక్టర్లు బత్తుల రాములు, లక్ష్మాగౌడ్, భాస్కర్, ప్రవీణ్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, సిబ్బంది లింగమూర్తి, భైరేశ్, గంగరాజు, నవీన్, రాజు, నబీ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేత



బాధితురాలికి ఎల్‌వోసీ అందిస్తున్న నాయకులు

మాచారెడ్డి: మండలంలోని లచ్చాపేటకు చెందిన జక్కుల జ్యోతికి చికిత్స నిమిత్తం మంజూరైన రూ. 2.50లక్షల ఎల్‌వోసీని బీజేపీ నాయకులు బుధవారం అందజేశారు. ఎల్‌వోసీ మంజూరుకు ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఎంతో కృషి చేశారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బూస సురేశ్, నాయకులు ప్రభాకర్, లింగం, అనిల్, ఎల్లం, స్వామి, భూపతి, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ బెస్ట్ ట్రైనర్‌గా రమేశ్

రాజంపేట: ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వ్యక్తిత్వ వికాస సంస్థ బెస్ట్ ట్రైనర్‌గా మండల కేంద్రానికి చెందిన రమేశ్ చైతన్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు సంస్థ వ్యవస్థాపకుడు విశ్వనాథం, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ శ్యామ్ రాథోడ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు. గత 90 రోజులుగా ఆన్‌లైన్‌లో జరిగిన ట్రెనింగ్‌తో పాటు ది ట్రైనర్ వర్క్‌షాప్‌తో పాటు హైదెరాబాద్‌లోని ఓ హోటల్లో ఇటీవల రెండు రోజుల పాటు నిర్వహించిన ఆఫ్ లైన్ వర్క్‌షాప్‌లో ప్రతిభ కనబరిచినందుకు ఈ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ చైతన్య మాట్లాడుతూ.. ఆత్మహత్యలు లేని, మంచి మనోబలం ఉన్న సమాజాన్ని నిర్మించడమే తన లక్ష్యమని, ఇందుకోసం తనవంతు ప్రయత్నంగా ప్రభుత్వ విద్యాసంస్థలలో ఉచితంగా మోటివేషనల్ సెషన్స్ నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

సంక్షిప్తం

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

తాడ్వాయి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాం దుస్తులను మాజీ సర్పంచ్ సంజీవులు బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కళ్యాణి, ఉపాధ్యాయుడు రాజాగౌడ్, వీడీసీ చైర్మన్ రాజు, గ్రామ పెద్దలు వెంకట్‌రాంరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్‌లో నోట్‌బుక్స్..

మద్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తనవంతు సహాయంగా మండల కేంద్రానికి చెందిన హోంగార్డ్ బండివార్ గోవింద్ నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నస్రుల్లాబాద్: బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మేకల రాములు తల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యెండల లక్ష్మీనారాయణ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట సున్నం సాయిలు, జి శ్రీనివాస్, పైడి లక్ష్మీనారాయణ, హన్మాండ్లు యాదవ్, వడ్ల సతీశ్, పెర్క రాములు, పవన్, రాజు, హరి ఉన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



బాలకిషన్ (ఫైల్)

కామారెడ్డి రూరల్: మండలంలోని ఉగ్రవాయి గ్రామ మాజీ సర్పంచ్ అబ్బగొని బాలకిషన్ గౌడ్ బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. రెండు రోజుల క్రితం బాలకిషన్‌గౌడ్‌కు పక్షవాతం రాగా హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో ఆయన సర్పంచ్‌గా, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పనిచేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె తండ్రికి తలకొరివి పెట్టారు.

తల్లిదండ్రులకు పాదపూజ



రామారెడ్డి: గిద్ద గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు బుధవారం పాద పూజ చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. సంస్కృతి, సాంప్రదాయలను అలవాటు చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు హెచ్‌ఎం కన్నయ్య తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూమేశ్, విష్ణు, రాజేశ్వర్, మహేశ్, స్వప్నప్రియ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు మెగా వైద్య శిబిరం

రాజంపేట: మండలంలోని బసన్నపల్లిలో గురువారం 60 ఏళ్లు పైబడిన, వికలాంగులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఆధ్వర్యంలో మెగా ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు యోగా రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిబిరంలో ఈసీజీ, కంటి, దంత, రక్త పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గ్రామస్తులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

■ తాడ్వాయిలో కప్ప కావడి

తాడ్వాయి: మండల కేంద్రంలో గురువారం కప్ప కావడి ఆటలు నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు మేకల రాజు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అన్ని కుల సంఘాల సభ్యులతో సమీక్ష నిర్వహించారు. వర్షాలు కురిసేందుకు కప్పకావడి ఆటలతో పాటు అలుగుల వద్ద వరదపాశం అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

■ 28న జాబ్ మేళా

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో ఈనెల 28న టాస్క్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ ఆర్ హరిస్మరణ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ కంపెనీలు ఈ మేళాలో పాల్గొని విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. 2022, 23, 24 సంవత్సరంలో డిగ్రీ పాసైన విద్యార్థులు అర్హులన్నారు.

■ 29న తైబజార్, పశువుల సంత వేలం

కామారెడ్డి టౌన్: మున్సిపల్ పరిధిలో తైబజార్, పశువుల సంతకు బహిరంగ వేలం ఈనెల 29న మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ. 50వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

■ జూలై1న బంజారా జాతీయ సదస్సు

బిచ్కుంద: బంజారా జాతీయ సమ్మేళన సదస్సును జూలై 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు జీవన్ రాథోడ్ బుధవారం పేర్కొన్నారు. సదస్సును బంజారాలు విజయవంతం చేయాలని కోరారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

కామారెడ్డి టౌన్: మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, రాజనర్సు, ప్రభాకర్, ప్రభు, దీపక్, రాజు, సాయిలు, జ్యోతి, విజయ్, నర్సవ్వ, రాజమణి, కార్మికులు పాల్గొన్నారు.